ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్, 2025
5
శ్రీకాకుళం



రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అధ్యక్షతన స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీరు శేఖర్, డైరెక్టర్లు ఎస్.వి.రమణ, రాజేంద్రప్రసాద్, కామేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ చదువుకున్న వారు అర్హులని అన్నారు. 18 నుంచి 30 మధ్య వయసు వారు పాల్గొనాలని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు సుమారు 16 కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. 900 పోస్టుల వరకు నియామకం ఉంటుందనానరు. ఆధార్ కార్డు, విద్యార్హత ఒరిజినల్ ధ్రువపత్రం, జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటలకు పాల్గొనాలని కోరారు.

ప్రయాణికుల పాట్లు

జిల్లాలో బస్సులు బంద్ అనేలా అన్ని కాంప్లెక్స్‌లు, బస్టాండ్లల్లో వాతావరణం కనిపించింది. విశాఖలో శనివారం నిర్వహించిన యోగా డేకు జిల్లా నుంచి 220 ఆర్‌టిసి బస్సులు తరలించారు. వీటితో పాటు కొన్ని ప్రైవేట్ బస్సులనూ వినియోగించారు. దీంతో ఆర్‌టిసి కాంపెక్స్‌ల్లో జనం లేక వెలవెలబోయాయి. కాంప్లెక్స్‌ల బయట, ఇతర ప్రాంతాల్లో ప్రాంతాల్లో మాత్రం జనం బస్సులు, ప్రైవేట్ వాహనాల కోసం అధిక సంఖ్యలో వేచి చూసిన పరిస్థితులు కనిపించాయి. ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ఇదే అదనుగా మ్యాక్సికేబ్‌లు, అద్దె కార్లు, అక్కడక్కడ తిరిగిన ప్రవేట్ బస్సుల యాజమానులు ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా ఛార్జీలను వసూలు చేశారు.



బస్సు నిండిపోవటంతో పాట్లు పడుతున్న ప్రయాణికులు

- యోగాంధ్రకు తరలి వెళ్లిన ఆర్‌టిసి, ప్రైవేట్ బస్సులు
- జిల్లాలో బంద్ వాతావరణం కనిపించిన వైనం
- ఇదే అదనుగా దోపిడీ సాగించిన ప్రైవేట్ వాహనాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, సిటీ

విశాఖలోని యోగా డే కార్యక్రమానికి 500 వరకు పభుత్వ, ప్రైవేట్ బస్సులను తరలించారు. ఈ నెల 20 సాయంత్రం నుంచే బస్సులను ఆయా మండల కేంద్రానికి పంపారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు హాజరయ్యే ఉద్యోగులు పాట్లుపడ్డారు. ఇంజినీరింగ్, ఇతర ఉన్నతవిద్య విద్యా సంస్థలు సెలవులు ప్రకటించగా, కళాశాలలు, పాఠశాలలకు యథావిధిగానే తరగతులు నిర్వహించారు. బస్సులు లేక విద్యార్థులు తరగతులకు హాజరు కాలేకపోయారు. ఆర్‌టిసి పాసులున్నా కొంతమంది విద్యార్థులు ఆటోల్లో ప్రయాణించి తరగతులకు హాజరయ్యారు. ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ వాహనాల యజమానులు ప్రయాణ ఛార్జీలు ఒక్క సారిగా పెంచారు. మరో పక్క కిక్కిరిసిన ప్రయాణికులతో ప్రైవేట్ ట్రాన్స్‌ఫోర్టు వాహనాలు కనిపించాయి. ఆటోలు, టాటా ఎసి, ఇతర క్యాబ్‌లు, కారులకు డిమాండ్, గిరాకీ ఏర్పడింది. జాతీయ రహదారిపై ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేందుకు గంటలు కొద్దీ నిరీక్షించి, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు అడిగి నంత చెల్లించి ప్రయాణాలు సాగించారు.

పల్లె వాసులకు పాట్లు

ప్రధానంగా విశాఖపట్నం, విజయనగరం వైపు వెళ్లే వారు ఇబ్బంది పడ్డారు. చాలా మంది అక్కడే నుంచే రాకపోకలు సాగిస్తూ ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు. బస్సులు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టెక్కలి, పలాస, రాజాం, పాలకొండ, ఇచ్ఛాపురం ప్రాంతాలకు వెళ్లే వారికీ ఇబ్బందులు తప్పలేదు. పల్లెవెలుగు బస్సులు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస వంటి ప్రాంతాల్లో ఆర్‌టిసి కాంప్లెక్స్‌లకు వెళ్లిన ప్రయాణిలు నిరాసతో వెనుతిరిగారు. కాంప్లెక్స్‌ల్లో బస్సులు లేకపోవడంతో నిర్మాణుష్యంగా కనిపించాయి. యోగాంధ్రకు బస్సులు వెళ్లి పోయాయని, ప్రయాణికులు సహకరించాలంటూ మైక్ అనౌన్స్ మెంట్‌చేయడం, కొద్ది పాటి బస్సులు ఉన్నా రద్దీగా ఉండటంతో ప్రయాణిలు అసంతృప్తితో వెనుతిరిగారు.

కిక్కిరిసి ప్రయాణం చేస్తూ...

చిన్నపిల్లలకు, కుటుంబాలతో వచ్చిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కాంపెక్స్‌లకు వచ్చిన ఒకట్రెండు బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించారు. నిత్యం రద్దీగా ఉండే రాజాం, పొందూరు, బొబ్బిలి, ఆముదాలవలస, పాలకొండ, టెక్కలి, నరసన్నపేట ప్రాంతాల బస్సులు అందుబాటులో లేకపోవటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ముఖ్యమైన ప్రాంతాల్లో తిరిగే బస్సులు సైతం నిలిపి వేయటం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. కనీసం సాధారణ ప్రయాణికుల అవసరాలు సైతం అధికారులు దృష్టిలో పెట్టుకోకుండా బస్సులు తరలించటం విమర్శలకు సైతం తావిస్తోంది. చిరు వ్యాపారులు చేసేవారు సైతం గమ్యస్థానాలకు చేందుకు ఇబ్బంది పడ్డారు. దీంతో ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.



శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఖాళీ ఉన్న ఫ్లాట్ ఫారాలు

పిపిపి పద్ధతితో వైద్య విద్య ప్రైవేటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పిపిపి పద్ధతితో విద్య వైద్యం ప్రయివేటీకరణ అవుతుందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ కామేశ్వరరావు అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలు-ప్రయివేటీకరణ అనే అంశంపై ప్రజారోగ్య వేదిక కన్వీనర్ డాక్టర్ మల్లేశ్వరరావు అధ్యక్షతన 'ప్రజారోగ్య వేదిక, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం' సంయుక్తంగా శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికీ ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో మన రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు కేటాయించారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణానికి రూ.8,548 కోట్లు కేంద్రం ఆమోదించిందని తెలిపారు. కేవలం నాలుగేళ్లలో రూ.2,225 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి ఐదు కళాశాలలను అరకొరగా పూర్తి చేసిందన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం... ఆ కారణంతోనే ఇప్పుడు పిపిపి విధానం తీసుకురావాల్సి వస్తుందని చెబుతుందని పేర్కొన్నారు. ఈ విధానం ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందో చెప్పలేకపోతుందని వ్యాఖ్యానించారు. పిపిపి అంటే ప్రయివేటీకరణ కాదని, ప్రభుత్వ అజామాషీలోనే కొనసాగుతాయని నమ్మబలుకుతోందని తెలిపారు. భవిష్యత్తులో కన్వీనర్ కోటా సీట్లు తగ్గిపోయి, ఖరీదైన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు పెరగబోతున్నాయని అన్నారు. దీంతో పేద విద్యార్థులు మంచి ర్యాంకులు సంపాదించినా భారీ ఫీజులు చెల్లించుకోలేక వైద్య విద్యకు దూరమవుతారు. ఐఎంఎ మాజీ కార్యదర్శి డాక్టర్ సత్యానంద్ మాట్లాడుతూ తొలుత పాక్షిక ప్రయివేటీకరణగా ప్రారంభమైందని, చివరకు పూర్తి ప్రయివేటీకరణ అయిపోతే ప్రమాదమే అని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాయకులు కె.మోహనరావు మాట్లాడుతూ వైద్య కళాశాలకు దానికి అనుబంధంగా నిర్మించే ఆస్పత్రికి అవసరమైన భూమిని ప్రయివేటు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వమే 60 నుంచి 99 ఏళ్ల కాల పరిమితితో అత్యంత చవక ధరకు లీజుకు ఇస్తుందని అన్నారు. భూమితో పాటు కళాశాల, ఆస్పత్రి నిర్మాణానికి అవసరమయ్యే పెట్టుబడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా 80 శాతం గ్రాండ్ రూపంలో ఇస్తాయి. ప్రజారోగ్యవేదిక నాయకులు డాక్టర్ కన్నేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య రంగంలో ప్రయివేటీకరణ గతంలోనే మొదలైందనర్నారు. సమావేశంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు ఎం.ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి పి.సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్, మెడికల్ రిప్రెసెంటేటివ్స్ సంఘం నాయకులు వాసు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చందు, రాజు, సాహితీ స్రవంతి నాయకులు నెట్టిమి రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు గోవర్ధనరావు, లాయర్ల సంఘం నాయకులు డి.రమణారావు, బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకులు శ్రీనివాసరావు, పెన్షనర్ల సంఘం నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, జర్నలిస్టుల సంఘం నాయకులు సత్తారు భాస్కరరావు, మెడికల్ అండ్ హెల్త్ సంఘ నాయకులు సాయిప్రసాద్, మురళి పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



ఫొటో: రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతం



సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రహదారులు, భవనాలశాఖ అధికారులను వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిపై అధికారులతో శనివారం సమీక్షించారు. చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో చెట్లతాండ్ర, డి.జి.పురం, లక్కందిద్ది, మర్రిపాడు రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించి రూ.3.70 కోట్లు, నౌపడ, డమరకం 13 కిలోమీటర్ల పరిధిలో రూ.6 కోట్లు అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని వివరించారు. నిధులు మంజూరులో జాప్యం ఉండరాదన్నారు. పాతజాతీయ రహదారి నుంచి టెక్కలి వరకు 4 కిలో మీటర్ల పరిధిలో రూ.3.5 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్త చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రహదారుల, భవనాలశాఖ అధికారులు పి.సత్యనారాయణ, రవికాంత్, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈనెల కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లాలో 27న నుంచి 30 వరకు నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, పి.పవిత్రలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల (పురుషుల) వద్ద ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ 1970 డిసెంబరు 30న స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా అధ్యయనం పోరాటం నినాదంతో ఏర్పాటైందన్నారు. 55 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని చెప్పారు. ఎక్కడైతే విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారో ఆ సమస్యల పరిస్కారానికి పోరాటాలు నిర్వహించి విద్యార్థుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యార్థులను పోరాటాలకు సిద్ధం చేస్తూ అనేక విజయాలను సొంతం చేసుకుందన్నారు. పేద విద్యార్థికి విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేస్తూ... పోరాటాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యా రంగ సమస్యల పరిస్కారానికి ఎన్నో నిర్బంధాలను, అక్రమ కేసులను సైత్తం ఎదుర్కొంటూ పోరాటాన్ని ముందుకు కొనసాగిస్తుందని చెప్పారు. భగత్ సింగ్ స్ఫూర్తితో భవిష్యత్‌లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు విద్యార్థులు సిద్ధం అయ్యేందుకు అఖిలభారత మహాసభలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందరూ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జయరాం, విద్యార్థులు శివ, కార్తీక్ మహేష్, భాను తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భార్యాభర్తల కలహాలతో కుమారుడు బలి

- బిడ్డతో సహా నదిలో దూకిన తల్లి
- ఆమెను రక్షించిన స్థానికులు
- భర్తతో తరచూ గొడవలతో మనస్తాపం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భార్యాభర్తల కలహాలకు అభం శభం తెలియని బాలుడు బలయ్యాడు. భర్తతో గొడవపడిన భార్య తన కుమారుడితో సహా ఆత్మహత్యకు చేసిన ప్రయత్నంలో, ఆమె బతికి బట్టకట్టగలిగినా.. కుమారుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని కుశాపురం పంచాయతీ యాతపేట చెందిన తుమ్మల యేసుబాబుకు, పెద్ద రెల్లివీధికి చెందిన మేనకోడలు విమలతో నాలుగున్నరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండున్నరేళ్ల వరుణ్‌తేజ్ అనే కుమారుడు ఉన్నాడు. యేసుబాబు సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని కొనుగోలు చేసి నిర్వహిస్తూ... ఉపాధి పొందుతున్నాడు. అయితే అతను నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా వారిద్దరు గొడవ పడ్డారు. దీంతో క్షణికావేశంలో శనివారం ఉదయం విమల తన కుమారుడితో సహా గుడివీధి సమీపంలో నాగావళి నదిలోకి దూకేసింది. ఆ పక్కనే పిండ ప్రదాన కార్యక్రమం చేస్తున్నవారు గమనించి విమలను రక్షించి బయటకు తీసుకొచ్చారు. కానీ, ఆమె కుమారుడు మాత్రం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికుల సాయంతో నదిలో గాలించగా చివరికి విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు ఒకటో పట్టణ ఎస్ఐ రామారావు సంఘటన స్థలానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడి తల్లి విమల కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయిందని కుటుంబ సభ్యులు అంటున్నారు, చికిత్స కూడా తీసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికీ భర్తతో గొడవ పడుతుండేదని చెబుతున్నారు. మృతదేహాన్ని యాతపేటలో శనివారం సాయంత్రం అత్యక్రియలు నిర్వహించారు.



మృతి చెందిన బాలుడుతో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మాదకద్రవ్యాల అడ్డుకట్టకు చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం సిటీ: మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈగల్ టీమ్ ఆధ్వర్యాన మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు చేపట్టిన ప్రచార పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ బంగారు భవిష్యత్‌ను మాదకద్రవ్యాల వల్ల నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలు వల్ల నష్టాలను అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం జరగుతుంటే వెంటనే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపాలని ఈగల్ టీంకు సూచించారు.

రోడ్డుపై సైకో వీరంగం

ప్రజాశక్తి- రణస్థలం


జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి రామతీర్థం జంక్షన్ వద్ద శనివారం రాత్రి లావేరు మండలం పిడుగుపాలేంకు చెందిన కన్నయ్య అనే వ్యక్తి సైకోలా ప్రవర్తించాడు. సైకో రోడ్డుపై నిలుచుని ఉన్నాడు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు హరేకృష్ణ భక్తులు కారులో వస్తున్నారు. కారు హారన్ కోట్టినా పక్కకు తప్పుకోలేదు. కారు ముందు భాగం సైకో కాలుకి తగిలింది. కాళు పై కారుతో గుద్ది వెళ్లిపోతారా అని కారు వెనుకాల పరిగెత్తి కారు అద్దాలు బద్దలుగొట్టి కారులోపల ఉన్న భక్తులను కొట్టి బీభత్సం సృష్టించాడు. కారు లోపల ఉన్న భక్తులు కారు డోర్ తీసుకుని బయటకు వస్తున్న సమయంలో కారుడోరు సైకో తలకు తగిలి గాయపడ్డాడు. అంతటితో ఆగకుండా జాతీయ రహదారిపై అడ్డంగా పడుకొని ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించారు. ఎంతమంది పట్టుకున్నా ఆగకుండా పట్టుకున్న వారిపై విరుచుకుపడ్డాడు. వాహనాలపై దాడిచేశాడు. అడ్డువచ్చిన స్థానికులపై దాడికి తెగబడ్డాడు. సైకో ప్రవర్తనతో విసిగిపోయిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్థానిక ఎస్ఐ ఎస్.చిరంజీవి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని సైకోని పట్టుకోవడానికి ప్రయత్నించారు. అతికష్టం మీద సైకో కన్నయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం కొండములగాం ఆస్పత్రికి ఆటోలో తరలించారు.

పాలనపై దృష్టి సారిస్తారా?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో నెల రోజులుగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం యోగాంధ్ర జపమే చేసింది. చివరి వారం రోజులైతే యోగా డే వేడుకల నిర్వహణ పతాక స్థాయికి చేరుకున్నాయి. జిల్లా నుంచి విశాఖకు జనం తరలింపు, అక్కడి ఏర్పాట్లు అందుకు సంబంధించిన బాధ్యతలతో అధికారులు తలమునకలైపోయారు. జిల్లాస్థాయి నుంచి సచివాలయ స్థాయి వరకు వివిధ కేడర్‌ల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులకు పలు రకాల బాధ్యతలను అప్పగించడంతో అంతా ఆ ఏర్పాట్లలోనే నిమగ్నమైపోయారు. దీంతో సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన సామాన్య జనానికి అధికారులు అందుబాటులో లేని పరిస్థితి తలెత్తింది. కలెక్టర్‌తో సహా ఇతర ముఖ్యమైన అధికారులు యోగా డే నిర్వహణ వేడుకల్లో నిమగ్నం కావడంతో పాలనపై తీవ్ర ప్రభావం చూపింది. యోగా అంశంపై తప్ప మరొక సబ్జెక్టును సమీక్షించిన దాఖలాలు అంతగా కనపడలేదు. కొన్ని ముఖ్యమైన ప్రజా సమస్యలు వెనక్కి వెళ్లిపోయాయి. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ప్రభుత్వం వాటి కంటే యోగాకే ప్రాధాన్యం ఇచ్చింది. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తీత పనులు చేపట్టడానికి వేసవి సీజన్ కంటే అనువైన సమయం ఉండదు. పనులపై సమీక్ష చేసి వేగవంత చేయాల్సిన సమయంలో అంతా యోగాలోనే కాలం గడచిపోయింది. వంశధార కుడి, ఎడమ కాలువల ద్వారా ఏటా జూన్ మొదటి వారంలోనే నీటిని విడిచిపెడుతున్నారు. పంట కాలువలకు ఈ సంవత్సరం ఎప్పుడు నీరు విడుదల చేయాలనేది నీటి లభ్యతపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాలన్నీ చర్చించాలంటే ఇప్పటికే నీటి సలహా మండలి సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా యోగాలోనే తలమునకలై ఉండటంతో ఇప్పటి వరకు అదీ జరగలేదు.

ఖరీఫ్‌లో ఈ సంవత్సరం అన్ని రకాల పంటలు కలిపి 4 లక్షల 7 వేల 488 ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని అధికారులు అంచనాలు రూపొందించారు. అందులో 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని ఆశిస్తున్నారు. ఖరీఫ్‌కు అన్ని రకాల విత్తనాలు కలిపి 40,596 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లా అవసరాలకు ఆ విత్తనాలు సరిపోతాయా? ప్రభుత్వం జిల్లాకు ఎంత మేర విత్తనాలు పంపింది అనే విషయాలను చర్చించడం మానేసి యోగాంధ్ర సమీక్షలతోనే సరి పెట్టిన పరిస్థితి మనం చూశాం. జిల్లాలోనే వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఉన్న నేపథ్యంలో దీనిపై సమీక్షించి ఉంటే విత్తనాల కొరత ఏమైనా ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడి జిల్లాకు రప్పించే వీలుండేది. కానీ, ఆయన కూడా యోగాంధ్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు తప్ప రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన పాపాన పోలేదు. వర్షాకాలం మొదలు కావడంతో సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. గ్రామాల్లో వైరల్ జ్వరాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్న పరిస్థితి నెలకొంది. యోగాంధ్ర లక్ష్యంపై దృష్టి సారించిన అధికారులు వీటిపై కనీసం సమీక్షించడానికి సమయం కేటాయించకపోవడంతో ప్రజలు వారి బాధలేవో వారు పడుతున్నారు.



జిల్లాల్లో యోగాపై పెద్ద ఎత్తున ప్రచారం చేసినా అంతిమ ఫలితం అంతంత మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. విశాఖలో నిర్వహించిన యోగా డేకు 20 వేల మందిని తరలించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించినా అందులో సగం మాత్రమే వెళ్లినట్లు తెలిసింది. విశాఖలో యోగా డే కోసం మండల కేంద్రాలకు బస్సులను తరలించినా వెళ్లేందుకు చాలా మంది అయిష్టత కనబరిచారు. దీంతో సగం బస్సులు వెనక్కి మరలినట్లు తెలిసింది. యోగా అలువాటు లేనివారు, ఆసనాలపై పెద్దగా ఆసక్తి లేని వారు వెళ్లేందుకు ఇష్టపడలేదు. మరీ ముఖ్యంగా నిద్రకు ఉపక్రమించే సమయంలో అర్ధరాత్రి తర్వాత బస్సులు బయలు దేరుతుండటంతో చాలామంది రావడానికి నిరాకరించారు. పోనీ విశాఖకు వెళ్లిన వారు ప్రశాంతంగా యోగా చేశారంటే అదీ లేదు. రాత్రంతా నిద్ర లేక ఒకవైపు, ప్రయాణ బడలికతో మరోవైపు ఇబ్బందులు పడుతునే యోగసనాలు వేసినట్లు వారి బాధలు చెప్పుకుంటున్నారు. తిరుగు ప్రయాణంలోనూ ఎండ వేడిమి, ట్రాఫిక్‌లో బస్సులు ఉండిపోవడంతో ఇబ్బందులు చవిచూశారు. మొత్తం మీద యోగా ఆసనాలు ముగించుకుని నీరసించిన ముఖాలతో చివరకు సాయంత్రానికి ఇళ్లకు చేరుకున్నారు. యోగా డేకు జిల్లా నుంచి 220 ఆర్‌టిసి బస్సులను తరలించడంతో బస్సులు లేక జనం పడ్డ అవస్థలు వర్ణనాతీతం. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు చాలా ఇబ్బందుల పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆస్పత్రులు, ఇతర పనులపై వచ్చిన వారికి ప్రయివేట్ వాహనాలే దిక్కయ్యాయి. అధిక ఛార్జీలతో ప్రయాణికుల జేబులు ఖాళీ అయ్యాయి. అంతటా బంద్ మాదిరి వాతావరణం కనిపించింది. ప్రజా రవాణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది.

మరోవైపు యోగా ఏర్పాట్ల బాధ్యతలను చూసిన పలువురు అధికారులు, ఉద్యోగులూ తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. గత వారం రోజులుగా తమకు అప్పగించిన పనులపై తీరిక లేకుండా పనిచేశారు. కలెక్టర్, ఇతర అధికారులు పదేపదే నిర్వహించిన సమీక్షలకు హాజరవుతూ, తమకు అప్పగించిన పనులపై క్షణం తీరిక లేకుండా అందరికీ ఫోన్లు చేస్తూ తీవ్ర ఒత్తిడి లోనయ్యారు. మండల కేంద్రాల్లో జనాల తరలింపు బాధ్యతలు చూసిన వారితో పాటు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వర్తించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రాత్రంతా జాగారమే చేశారు. యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందో లేదో తెలియదు గాని యోగా ఏర్పాట్ల నిర్వహణలో మాత్రం వారికి లేని మానసిక ఒత్తిడి దరి చేరింది. యోగా డే ముగియడంతో పెద్ద గండం గడచినట్లుగా అధికారులు, ఉద్యోగులు, సహాయక సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. విశాఖలో యోగా డే నిర్వహణతో ప్రభుత్వం రికార్డులు నెలకొల్పవచ్చు గాక జిల్లాలో ప్రధాన ప్రజా సమస్యలు మరుగున పడిపోవడంతో పాటు ఇటు అధికారులు, సామాన్య జనం పడరాని పాట్లు మాత్రం పడ్డారు. యోగా డే తంతు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటి నుంచైనా పాలనపై దృష్టి సారిస్తుందని ఆశిద్దాం.


మాట్లాడుతున్న యుగంధర్

యోగాంధ్ర కాదు... ఉద్యోగాంధ్ర కావాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్

ప్రజాశక్తి- నరసన్నపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి యోగాంధ్ర కాదని... ఉద్యోగాంధ్ర కావాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ అన్నారు. నరసన్నపేట పట్టణంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మంది నిరుద్యోగులు ఉన్నారని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం బాధాకరమని అన్నారు. యోగా డే సందర్భంగా విశాఖపట్నానికి అనేక మందిని తరలించి కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టారని అన్నారు. ఆ నిధులు నిరుద్యోగ యువతకు పెట్టి ఉంటే కొన్ని ఉద్యోగాలైన వచ్చేవని పేర్కొన్నారు. 26 వేల మంది గిరిజన విద్యార్థులను విశాఖకు తరలించారని, గిరిజన పిల్లలకు పోషక ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజనులకు ఉన్నతమైన స్కూళ్లు, నాణ్యమైన విద్య, మంచి భోజనం, క్రీడారంగం అభివృద్ధి చేసినప్పుడే రాష్ట్రానికి యోగాంధ్రా లాంటి కార్యక్రమాన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.అరవింద్, వై.వేణు, జి.వసంతరావు పాల్గొన్నారు.

'యువత పోరు' పోస్టరు ఆవిష్కరణ

నరసన్నపేట: వైసిపి నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ కూటమి సర్కారుపై నిరసన గళం తెలియజేసే ఈ కార్యక్రమం యువజన విభాగం ఆధ్వర్యాన యువత పోరు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో పోరుబాటు పోస్టర్‌ను శనివారం నిర్వహించారు. వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టెక్కలి రూరల్ : వైసిపి కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువజన విభాగం కార్యదర్శి యర్ర చక్రవర్తి, నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, అధికార ప్రతినిధి సత్తారు సత్యం, మండల యువజన అధ్యక్షుడు కణితి గిరి, డొక్కరి నీలకంఠం, మెండ జగన్, టెక్కలి టౌన్ అధ్యక్షుడు బర్ల కార్తిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కింతల శేషగిరి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

నందిగాం: మండలంలోని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు చేస్తున్నట్టు టిడిపి మండల అధ్యక్షులు పినకన అజయ్‌కుమార్, మల్ల బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మండలంలో నీపెంటఊరు, పొల్లాడ, బడబంద, రౌతు పురం, నందిగాం, సుబ్బమ్మపేట రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


మహేష్‌ను పరామర్శిస్తున్న రామ్ మల్లిక్ నాముడు తదితరులు

రామ్ మల్లిక్ నాయుడు పరామర్శ

లావేరు: మండలంలోని అప్పాపురం మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు శనివారం పరామర్శించారు. మహేష్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో శస్త్రచికిత్స జరిగి ఇంటి వద్ద కోలుకు ంటున్నాడు. విషయం తెలుసుకున్న రామ్ మల్లిక్ నాయుడు పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రెడ్డి శంకర్ మేస్త్రిని వారి స్వగృహంలో పరామర్శించారు. ఈయనతో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, దారపురెడ్డి కూర్మారావు, ఇజ్జు బాబూరావు, బాసిన దాలిరాజు, అదపాక రామారావు తదితరులున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

పొందూరు: మండలంలోని తాడివలస, గండ్రేడు, లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం సర్పంచ్ ప్రతినిధి టి.వెంకట జగన్నాథరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన, ఆయా పాఠశాలలకు ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు దుశ్శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తమ్మినైన లక్ష్మణరావు, సీపాన భాస్కరరావు, తమ్మినైన బాలకృష్ణ, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఎఎఫ్ నిరంతర ప్రక్రియ

శ్రీకాకుళం సిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ రాష్ట్ర చైర్మన్, సీనియర్ అడ్వకేట్ పినిపే వెంకట రామకృష్ణ అన్నారు. నగరంలోని ఇలిసిపురం జంక్షన్‌లో అంబేద్కర్ మందిరంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్‌సి, ఎస్‌టి అడ్వకేట్స్ క్యాడర్ క్యాంపును శనివారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 158 బార్ కౌన్సిల్‌లు ఉన్నాయని, వాటిలో కూడా ఎఎఎఫ్ క్యాడర్ ఉందని చెప్పారు. ఎఎఎఫ్ అనేది నిరంతర ప్రక్రియ అని, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేనిదన్నారు. ఈసారి రాష్ట్ర బార్‌కౌన్సిల్ పోటీల్లో ముగ్గురు న్యాయవాదులు తప్పనిసరిగా గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పొన్నాడ రాము, మురళీకృష్ణ, రుంకు అప్పారావు, గంజి ఆర్ ఎజ్రా, ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సభ్యులు, అడ్వకేట్ దండసి జాన్, వై.చలపతి, కామరాజు, చిన్నారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నిత్య జీవితంలో యోగా సాధనను భాగంగా చేసుకుంటే మానసిక ప్రశాంతత, శారీరక శక్తి దక్కుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అధికారులు, యోగా శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాండ్రంగి మురళీకృష్ణ శిక్షణలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ సంచాలకులు బి.శాంతిశ్రీ, జిల్లా వైద్యాధికారి కె. అనిత, నెహ్రూ యువ కేంద్రం ఉపసంచాలకులు వెంకట్ ఉజ్వల్, ఆయుష్ శాఖ వైద్యులు జగదీష్, ఉత్తరాంధ్ర రాజా, యోగా శిక్షకులు, సాధకులు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక గ్రంథాలయంలో యోగాసనాలు వేశారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగాలో హెచ్ఎం పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు గోవిందరావు, ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, వెంకటరావు, తమ్మి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: కింజరాపు యర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కె.ప్రకాశరావు, ఇన్‌ఛార్జి డీన్ శ్రావణి, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి బి. అనసూయమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: యోగా దినోత్సవాన్ని జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రేవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, రవిబాబు, హెచ్ఎం కె.ఎ. రాములు, యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, పి.మోహన్, శరత్ కుమారి, అప్పన్న, కుమారి పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో కూటిమి నాయకులు ఆధ్వర్యంలో, ఎక్సైజ్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ వై.రాజు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఆసనాలు వేశారు.

మెళియాపుట్టి : ప్రభుత్వ కార్యాలయాల్లో, చాపర ఉన్నత పాఠశాలలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగసనాలు వేశారు. వ్యవసాయశాఖ ఎడి మండల స్పెషల్ ఆఫీసర్ లింగాల వెంకట మధుబాబు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి లోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.

నరసన్నపేట : స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన యోగాలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ఒకాల్లాండ్‌లో ప్రిన్సిపాల్ మల్ల మధులత ఆధ్వర్యాన విద్యార్థులు యోగాసనాలు వేశారు. టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి విలియం, ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావుల పర్యవేక్షణలో యోగాంధ్ర నిర్వహించారు.

కవిటి: అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్లెల నుంచి పట్టణాల వరకూ, ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రైవేట్ సంస్థల వరకూ ఆసనాలతో అలరించాయి. ఉదయం ఐదు గంటల నుంచే ప్రారంభమైన యోగా శిబిరాలు పూర్తిస్థాయిలో విజయవంతమయ్యాయి.

ఇచ్ఛాపురం : స్థానిక సురంగి రాజా మైదానంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి, కమిషనర్ నల్లి రమేష్, మండలంలో డొంకూరు తీర ప్రాంతంలో ఎంపిడిఒ రామారావు ఆధ్వర్యాన, పురుషోత్తంపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ జూహిత ఆధ్వర్యాన యోగాసనాలు వేశారు.

కోటబొమ్మాళి: యోగాంధ్రలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసరావు, టిడిపి నాయకులు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, ఎన్.శ్రీనివాసరావు, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ఆధ్వర్యాన నిర్వహించిన యోగాంధ్రలో ఎంపిడిఒ నీరజ, ఎఒ బి.రాంబాబు, ఇఒపిఆర్‌డి వసంతకుమారి, లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, లోతుగెడ్డ ఇందిరరామ్, గోగుల చిట్టిబాబు, వెంకటకృష్ణ, జి.మన్మథరావు, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

పలాస : ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల ఆవరణలో యోగంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు వేశారు.


శ్రీకాకుళం సిటీ: యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, అధికారులు

నందిగాం : ప్రభుత్వ కార్యాలయ వద్ద, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఆవరణలో యోగాంధ్రాలో భాగంగా అధికారులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.

సోంపేట : స్థానిక శైలజ కళ్యాణమండపం వద్ద సంస్కార భారతి విద్యాసంస్థల విద్యార్థులు యోగా శిక్షకులు ఓట్ల మీనకేతన్నారావు ఆధ్వర్యాన యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.దాసు, చైర్మన్ వై.దేవరాజు, ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి, కవిబాబు, ఎఒ పాపారావు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులు అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా యోగాసనాలు వేశారు. నౌపడ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ భీమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయుష్ వైద్యులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశాలు, ఎఎన్ఎంలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యా సదస్సు

శ్రీకాకుళం సిటీ: ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభల సందర్భంగా ఆదివారం శ్రీకాకుళం నగరంలో నూతన విద్యా విధానం - విద్యారంగం ప్రభావంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యారంగ నిపుణులు, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.పవిత్ర పాల్గొంటారని చెప్పారు.

పేద దళిత విద్యార్థులకు సీట్లు ఇవ్వాలి

శ్రీకాకుళం సిటీ: సాంఘిక సంక్షేమ శాఖ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాల్లో భర్తీ చేయగా, మిగిలిన సీట్లలో ప్రవేశ పరీక్ష రాయని నిరుపేద దళిత విద్యార్థులకు ఖాళీగా ఉన్న సీట్లు కేటాయించాలని కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఇంటర్మీడియట్ సీట్లు ఖాళీగా ఉన్నా పరీక్ష రాసిన విద్యార్థులతోనే నింపుతున్నారన్నారు. సొసైటీ అధికారులు మంకుపట్టు వీడాలన్నారు. ఖాళీ సీట్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, వసతి గృహాల్లో చదివిన అర్హత కలిగిన దళిత విద్యార్థులతో నింపాలని, ఈ నెల 27న పరీక్ష రాసిన విద్యార్థులకు ఇవ్వగా మిగిలిన సీట్లలో పరీక్షరాయని విద్యార్థులతో నింపాలని కోరారు. ఇలా చేయడం వలన అన్ని సీట్లు భర్తీ అవుతాయని, విద్యార్థులకు క్లాసులు కూడా ప్రారంభించ వచ్చునన్నారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా దళిత, ప్రజా సంఘాలు, ప్రగతిశీల విద్యార్థి సంఘాల ఐక్యతతో ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల: పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఎపి పాలీసెట్ 2025 తొలివిడత వెబ్ కౌన్సెలింగ్ మండలం కుశాల పురంలోని ప్రభుత్వ పురుషుల పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ప్రారంభమైంది. తొలిరోజు 1 నుంచి 1500 ర్యాంకు మధ్య విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలన నిర్వహించగా ఒసి, బిసి విద్యార్థులు 312, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 12 మంది మొత్తం 324 మంది విద్యార్థులు హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం విద్యార్థులకు ఈనెల 25న కళాశాల బ్రాంచ్ ఎంపికకు వెబ్‌ఆప్షన్ ప్రారంభిస్తామని, రెండవరోజు 1500 ర్యాంకు నుంచి 3200 ర్యాంక్ వరకు గల విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలనకు హాజరుకావాలని అధికారులు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు, సహాయ కేంద్ర సమన్వయకర్త డా.కె. నారాయణరావు, సీనియర్ అధ్యాపకులు మురళీకృష్ణ. పర్యవేక్షణలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పొందూరు: మండలంలోని కింతలి గ్రామంలోని పెద్దవీధిలో సిసి రహదారి, కాలువల నిర్మాణానికి శనివారం సర్పంచ్ పైడి రాంప్రసాద్ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. రూ.2లక్షలు పంచాయతీ నిధులతో ఈ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ దవల గణపతిరావు, మాజీ ఎంపిటిసి సింగూరు రమణారావు, ఉప సర్పంచ్ బెండి అమ్మాజీ, టిడిపి నాయకులు కె.అసిరినాయుడు, పి.యుగంధర్, కిల్లి రామారావు, కె.లోకనాధం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయి తదితరులు పాల్గొన్నారు.


సిసి రహదారికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

చైర్‌పర్సన్‌పై అనర్హత నోటీసు జారీ చేయాలి

వైస్ చైర్‌పర్సన్ స్వర్ణమణి


ఆధారాలు చూపిస్తున్న స్వర్ణమణి, శంకరకుమార్

ఇచ్ఛాపురం: అక్రమ నిర్మాణం పనులు అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మిపై అనర్హత నోటీసు జారీ చేయాలని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖ పంపించారు. ఈ లేఖను శనివారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపి మున్సిపల్ చట్టంలోని 16 (1) (ఎఎ) ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి వార్డులో అక్రమ నిర్మాణాలు నిరోధించాల్సిన బాధ్యత ఆమెకు ఉందని అన్నారు. ఆ బాధ్యతలో విఫలమైతే సెక్షన్ 17 ప్రకారం అనర్హత పొందుతారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వార్డు నంబరు 13 బెల్లుపడ గాంధీ విగ్రహం నుంచి అచ్చంపేటకు వెళ్లే దారిలో ఉత్తర శ్రేణి, లోపింటి వీధి, పడమర శ్రేణిలో ఒక రెండు అంతస్తుల భవనం నిర్మాణంలో ఉందన్నారు. మొదటి అంతస్తుకు శ్లాబ్ కూడా పడిపోయిందన్నారు. మున్సిపాలిటీకి ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్‌ల పోర్టల్‌లో 2024-25 ప్లాన్‌లు పరిశీలించగా, సదరు భవనానికి ప్లాన్ లేదని అన్నారు. అది అక్రమ నిర్మాణమని నిర్ధారణ అయ్యిందన్నారు. ఆమె బాధ్యతను నిర్లక్ష్యం చేశారని, అందువల్ల అనర్హత పొంది ఉన్నారని అన్నారు. సెక్షన్ 17(1) ప్రకారం ఒక ఓటర్‌గా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లాభాల శంకర్ కుమార్ ఈ నెల 16న మున్సిపల్ కమిషనర్‌కు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ ఫిర్యాదుపై సెక్షన్ 17 ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ పరిపాలనకు సంబంధించి ప్రశ్నలను కౌన్సెలర్లు చైర్‌పర్సన్‌ను ఏడు రోజుల వ్యవధితో అడిగినట్లయితే సదరు ప్రశ్నలకు కౌన్సిల్ సమావేశం ఎజెండాలో మొదటి అంశంగా మున్సిపల్ అధికారుతో సమాధానం ఇప్పించి మినిట్స్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత చైర్‌పర్సన్‌పై ఉందన్నారు. ఆ అధికారం మేరకు సాధారణ సమావేశంలో సమాధానం ఇప్పించాలని రిజిస్టర్డ్ పోస్టు కోరారని అన్నారు.

కళింగ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షులుగా శిరీష


శిరీషను అభినందిస్తున్న మహిళలు

కవిటి: కళింగ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షులుగా టెక్కలి మాజీ ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి కుమార్తె సిగిలిపల్లి శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం జిల్లా మధురవాడలో ఎపి కళింగ సంక్షేమ సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ చాలా ఏళ్ల నుంచి విద్య, వైద్య, సమాజ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనకు కళింగ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా అవకాశం కల్పించడంపై కృతజ్ఞతలు చెప్పారు. అదే సమయంలో మహిళల హక్కులు, చట్టాల గురించి పూర్తిస్థాయిలో పోరాడుతూ సామాజిక సేవ లక్ష్యంగా కొనసాగుతానని తెలిపారు. కళింగ సంక్షేమ సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కళింగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.రమణ, ఉపాధ్యక్షుడు ఎస్.సత్యం, జిల్లా అధ్యక్షుడు అన్నెపు గోవిందరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.ధర్మరాజు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ దివ్వల జగదీష్, మహిళా సెక్రెటరీ జె.ఉషారాణి, గౌరవాధ్యక్షుడు సీపాన రామచంద్రరావు, సలహాదారులు బిర్లంగి రామ, నరేష్ పాల్గొన్నారు.

అందరి భాగస్వామంతో విద్యాభివృద్ధి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అందరి భాగస్వామ్యంతోనే గ్రామంలో విద్యాభివృద్ధి సాధ్యమని కంబాలరాయుడుపేట సర్పంచ్ కంబాల చిరంజీవిరావు అన్నారు. స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎల్.కరుణాకర్ ఆధ్వర్యాన యోగంధ్ర తరువాత విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే నోట్ పుస్తకాలను శనివారం అందజేశారు. రూ.పది వేలు ఖర్చుతో వివిధ రకాల మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారు. పాఠశాల, విద్యాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలు, స్వచ్ఛంద సంస్థల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ శివాజీ, జనని సామాజిక సమితి అధ్యక్షులు మూగి కుమారస్వామి, మాతృభూమి అభివృద్ధి సమాఖ్య అధ్యక్షుడు కంబాల పాపారావు, గ్రామపెద్దలు గురు నాధరావు, జంగమయ్య, విశ్వనాథం, సాంబమూర్తి పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చిరంజీవిరావు

గుర్రపుడెక్కను తొలగించాలి


గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న సాంబమూర్తి

నందిగాం: మండలంలోని కనితూరు వద్ద ఎడమ ప్రధాన కాలు నుంచి కొండవురు-బెండి వెళ్లే 60ఆర్ కాలువ, ప్రధాన కాలువ నారాయణపురం మీదుగా పలాస వెళ్లే వంశధార మెయిన్ కాలువ పూర్తిగా గుర్రపు డెక్కులు పేరుకు పోయాయని రైతు సంఘం మండల నాయకులు పాలిన సాంబమూర్తి అన్నారు. ఈ మేరకు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీనివల్ల కాలువల్లో నీరు సమపాళ్లలో వెళ్లకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖరీఫ్ సమీపిస్తున్న సమయంలో రైతులకు సాగునీరు అందాలంటే కాలువలు పూర్తిస్థాయిలో గుర్రపుడెక్కున తొలగిస్తే తప్ప నీరందే పరిస్థితి లేదని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పై అధికారులు స్పందించి తక్షణమే గుర్రపు డెక్కలను తొలగించి కాలువ మరమ్మత్తులు పనులు చేపట్టి రైతులు ఇబ్బంది పడకుండా మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న సభ్యులు

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాం కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పొట్టి జగదీష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణం రాజు, కోశాధికారి భుజంగరావు శనివారం మృతుడు జగదీష్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం డెత్‌రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయంగా రూ.లక్ష చెక్కును ఎస్‌పి ఆదేశాల మేరకు మృతుడి భార్య పుష్పలతకు అందజేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


జగన్నాథం (ఫైల్)

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అదపాక గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఆదపాక సమీపంలోని పొలాల్లో మృతదేహం ఉందని విఆర్‌ఒకు తెలపగా విఆర్‌ఒ ఎన్. వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతుడు ఆటోడ్రైవర్ తిరండి జగన్నాథం (37)గా గుర్తించారు. మృతునిది విశాఖపట్నం జిల్లా తాటిచెట్లుపాళెం అని తెలిపారు. జగన్నాధం మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. విఆర్‌ఒ ఫిర్యాదు మేరకు హెచ్‌సి జోగారావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

పలాస: పలాస సూదికొండకాలనీలో ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకొని ఎస్. నూకరాజు (22) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన తండ్రి నారాయణ జీడి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి రూమ్‌లో తండ్రి నిద్రిస్తుండగా మరో రూమ్‌లో నూకరాజు ఫ్యాన్ హుక్కు లుంగీ కట్టి ఉరి వేసుకున్నాడు. పొరుగున ఉన్న మహిళ మిక్సీ కావాలని వీరింటికి రాగా, ఉరిపోసుకొని ఉన్న నూకరాజు కనిపించడంతో కేకలు వేసింది. నిద్రిస్తున్న మృతుడి తండ్రిని మేలుకొలిపి విషయం చెప్పింది. వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడు తున్నాడని, దీనివల్లే ఆత్మహత్యకు పాల్పడ్డారని మృతుడి తండ్రి తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తులు మృతి

టెక్కలి : మండలంలోని నౌపడ రైల్వే కూడలి సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహాన్ని పలాస జిఆర్‌పి పోలీసులు శనివారం గుర్తించారు. మృతుడికి 50 నుంచి 60 ఏళ్లలోపు వయసు ఉంటుందని అంచనా. మృతదేహాన్ని గుర్తించిన వారు హెచ్‌సి మధుసూదనరావును సంప్రదించాలని పోలీసులు కోరారు.

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఉదయం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు హెచ్‌సి ఎం.సోమేశ్వరరావు తెలిపారు. మృతుడు రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని శరీరంపై తెలుపు, నలుపు గీతల టీషర్టు, నల్లటి నిక్కరు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 9110305494 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మిగులు సీట్లకు కౌన్సెలింగ్

శ్రీకాకుళం సిటీ: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీయట్ ప్రవేశానికి ఎపి బిఆర్ఎ జిసెట్-2025 రాసి సీట్లు కౌన్సెలింగ్‌లో రాని విద్యార్థులకు ఈ నెల 22, 23 తేదీల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. 22న బాలికలకు ఎచ్చెర్ల గురుకుల పాఠశాలలో, 23న బాలురుకు దుప్పలవలస గురుకులంలో 5వ తరగతి ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంటర్మీ డియట్ ప్రవేశాలకు సంబంధించి 26న బాలికలకు ఎచ్చెర్ల గురుకులంలో, బాలురుకు 27న దుప్పలవలసలో కౌన్సె లింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఏజెన్సీలో రహదారులు నిర్మించడం సంతృప్తి

పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరావు



ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు రహదారులు నిర్మించడం నా ఉద్యోగ జీవితంలో మిక్కిలి సంతప్తినిచ్చిందని పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటరావు తెలిపారు. జూన్ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 1963 జూన్ 24న శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం, పాడలి గ్రామంలో తల్లి పారమ్మ, తండ్రి లక్ష్మయ్య దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు.

విద్యాభ్యాసం: 1968లో జన్మస్థలం పాడలిలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్య ప్రారంభించారు. ఒకటో తరగతి నుంచి 5 వరకు అక్కడే చదివి, తమకు దగ్గరలో ఉన్న దుగ్గూరులో ఆరు, ఏడు తరగతులు పూర్తిచేసి, పారాపురంలో 8వ తరగతి చదివి, హిరమండలం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదివి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో టెక్నికల్ విద్య పూర్తి చేశారు.

ఉద్యోగ జీవితం: 1982లో పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యుఎస్ విభాగంలో డ్రాఫ్ట్‌మాన్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. మొదటి సంవత్సరం జన్మస్థలం పాడలిలో పనిచేశారు. 1984లో విజయనగరం జిల్లా కొత్తవలసలో పనిచేశారు. మధ్యలో 1987 నుంచి 1991 వరకు కాకినాడ జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీర్‌గా బిటెక్ పూర్తి చేశారు. మరలా 1991లో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి పొంది సీతంపేట ఐటిడిఎలో పనిచేశారు. అక్కడ నివసిస్తున్న సమయంలో ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు రహదారులు, వ్యవసాయ బావులు, చెక్ డ్యామ్‌లు నిర్మించడం తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

1994 టెక్కలి పంచాయతీరాజ్ డివిజన్‌లో, 1995 శ్రీకాకుళం డివిజన్‌లో పనిచేశారు. 1997 మండల ఇంజనీరింగ్ అధికారిగా ఉద్యోగోన్నతి పొంది సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో పనిచేశారు. 2006లో డిప్యూటీ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి పొంది శ్రీకాకుళం సర్వశిక్ష అభియాన్‌లో పనిచేశారు. 2015లో కోటబొమ్మాళిలో పంచాయతీరాజ్ డిఇఇగా పనిచేశారు. 2019 వరకు శ్రీకాకుళం పంచాయతీరాజ్ డివిజన్ ప్రాజెక్టులో పని చేశారు. 2019 ఆగస్టు నుంచి 2025 జూన్ నెలాఖరు వరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పిఆర్ ప్రాజెక్టులోను, సమగ్రశిక్షలో ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కుటుంబ నైపథ్యం: భార్య నిమ్మితి కమల, గృహిణి, పెద్ద కుమారుడు పవన్ కుమార్, సీనియర్ మేనేజర్‌గా హెచ్ఎఎల్‌లో పని చేస్తున్నారు. పెద్దకోడలు అనూష, హోమియోపతి డాక్టర్‌గా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు దుర్గాప్రసాద్, విశాఖ పట్నం విఎమ్ఆర్‌డిఎలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. చిన్న కోడలు ఆశ, గృహిణి. కుమార్తె శాంతి, అల్లుడు జగదీశ్వరరావు విద్యుత్ శాఖ శ్రీకాకుళంలో సహా ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మనవళ్లు విక్రమ్ సౌర్య, గీతిక శరణ్య, నవీన్ సాయి దుర్గ, దీపిక ఉన్నారు.

శేష జీవితం: కుటుంబానికి సహాయపడుతూ జన్మస్థలం పాడలిలో వ్యవసాయం చేస్తాను. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాను. అవసరం మేరకు నా సహోద్యోగులకు సూచనలు, సలహాలు ఇస్తానన్నారు.

రోడ్లపైనే విచ్చలవిడిగా పార్కింగ్

ఇబ్బందులు పడుతున్న ప్రజలు


సర్వీసు రోడ్డుపై నిలుపుదల చేసిన వాహనాలు

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య సర్వ సాధారణంగా మారింది. ఈ మధ్య కాలంలో ఈ సమస్య మరీ ఎక్కువైంది. సర్వీసు రోడ్డు అక్రమణలతో వాహనదారుల కష్టాలు షరా మామూలుగా మారాయి. అడుగుతీసి అడుగు బయట పెట్టడం కూడా కష్టంగా మారుతోంది. సర్వీసు రోడ్డులో పండ్లబండ్లు, పానీపూరి బండ్లు, ఇతర వ్యాపారాలు కొనసాగుతున్నాయి. సర్వీసు రోడ్డు అక్రమణలతో షాపింగ్ కోసం, ఇతర అవసరాల కోసం రణస్థలం మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ద్విచక్రవాహనాలతో మండల కేంద్రానికి వచ్చి సర్వీసు రోడ్డుపైనే వాహనాలను ఇరువైపులా విచ్చలవిడిగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. అలాగే ఆటోలు కూడా సర్వీస్ రోడ్డుపైనే ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా పోలీసులు మాత్రం లైట్ తీసుకుంటున్నారు. ఒక్కోసారి సర్వీసు రోడ్డుగుండా పోలీసులు వాహనాలతో పోలీసుస్టేషన్‌కి రావడానికి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. అయినా ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. మండల కేంద్రం రద్దీగా ఉండటంతో ఎక్కడ కొంచెం ఖాళీ ప్రదేశం కనిపిస్తే, వాహనదారులు అక్కడ పార్క్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మండల కేంద్రంలోని సర్వీసురోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.